క్లుప్తంగా

అవిశ్వాస తీర్మానం అమలు చేయాలని వినతి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న వార్డు సభ్యులు

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : కోదాడ మండలం అడ్లూరు గ్రామ ఇన్‌చార్జ్ సర్పంచ్‌గా కొనసాగుతున్న ఉప సర్పంచ్ జట్టి లచ్చిరెడ్డిపై పెట్టిన అవిశ్వాస తీర్మానాన్ని అమలు చేయాలని కోరుతూ వార్డు సభ్యులు సోమవారం ప్రజావాణిలో కలెక్టర్ ఎస్ వెంకట్రావుకు వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ కొన్ని రోజుల కిందట మెజార్టీ వార్డు సభ్యుల సంతకాలతో ఉప సర్పంచ్‌పై అవిశ్వాస తీర్మానం పెట్టగా అధికారులు విచారణ చేపట్టలేదని తెలిపారు. కలెక్టర్ స్పందించి అవినీతికి పాల్పడుతున్న ఉప సర్పంచ్‌పై వార్డు సభ్యులు పెట్టిన అవిశ్వాస తీర్మానంపై విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు వెంకటరమణ, సౌదర్య, మంగమ్మ, శాంతకుమారి, తిరపయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

మునగాల : మండల కేంద్రంలో గల మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఉదయం 11గంటలకు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ బి.వెంకటేశ్వర్లు తెలిపారు. ఎంపీపీ ఎలక బిందు అధ్యక్షతన నిర్వహించే సమావేశానికి మండలంలోని ఆయా శాఖలకు చెందిన అధికారులు తమ మూడు నెలల నివేదికతో హాజరు కావాలని కోరారు.

రాజ్యాంగ రక్షణయాత్రను జయప్రదం చేయాలి

మునగాల : కులవివక్ష పోరాట సమితి(కేవీపీఎస్) ఆధ్వర్యంలో నిర్వహించే రాజ్యాంగ రక్షణ యాత్రను జయప్రదం చేయాలని కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు నందిగామ సైదులు సోమవారం ఒక ప్రకటనలో కోరారు. మనువాదాన్ని మట్టుబెట్టి రాజ్యాంగాన్ని రక్షించుకుందామని కేవీపీఎస్ ఆధ్వర్యంలో జీపు యాత్ర సూర్యాపేట జిల్లా కేంద్రం నుంచి అన్ని మండలాలు తిరుగుతూ మంగళవారం ఉదయం మునగాల మండల కేంద్రానికి చేరుకుంటుందని తెలిపారు. కావున దళితులు, దళితసంఘాలు కలసి ఈ యాత్రను జయప్రదం చేయాలని సైదులు కోరారు.

ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న కేంద్రం

హుజూర్‌నగర్ : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఎనిమిదేళ్లుగా ప్రజా కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తుందని సీపీఎం మండల కార్యదర్శి హుస్సేన్ అన్నారు. సోమవారం సీపీఎం రూరల్ మండల కమిటీ సమావేశం హుజూర్‌నగర్‌లో నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం వ్యవసాయ కూలీలకు పనులు కల్పించకుండా కార్పొరేటు సంస్థలు ఆదాని అంబానీకి కట్టబెట్టడం కోసమే ఉపాధి హామీ చట్టాన్ని లేకుండా చేయాలని చూస్తున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో చింతకుంట్ల వీరయ్య, వెంకటచంద్ర, లక్ష్మీనరసింహ, వెంకటరెడ్డి చందాల, భిక్షం సిద్దెల ,వెంకటయ్య, ఖాసిం, నరసింహ చారి పాల్గొన్నారు.

కుక్కల బెడదను నివారించాలి

హుజూర్‌నగర్ రూరల్ : మండలంలోని లింగగిరి గ్రామంలో కుక్కల బెడదను నివారించాలని గ్రామస్తులు కోరుతున్నారు. వీధుల్లో గుంపులు గుంపులుగా తిరుగుతూ ప్రజలను చిన్నారులు పాఠశాలలకు వెళ్లే విద్యార్థుల వెంటపడుతూ భయబ్రాంతులకు గురిచేస్తున్నాయన్నారు. గ్రామపంచాయితీ అధికారులు చొరవ తీసుకుని కుక్కల బెడదను నివారించేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఉపాధిహామీ కూలీలకు ఓఆర్‌ఎస్ ప్యాకెట్ల పంపిణీ

చిలుకూరు : ఉపాధిహామీ కూలీలకు సోమవారం గ్రామ పంచాయతీ కార్యదర్శి శోభన్‌బాబు ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉదయం పూట త్వరగా పనులకు వచ్చి త్వరితగతిన తమకు కేటాయించిన పనిని పూర్తి చేసుకోవాలన్నారు. పనులు జరిగే చోట కూలీలకు టెంట్ సౌకర్యం, మంచినీటి సౌకర్యం కల్పించనున్నట్లుగా తెలిపారు. ఈ కార్యక్రమంలో టీఏ స్రవంతి, సీనియర్ మేట్ అంజనేయులు , కూలీలు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలో గ్రాడ్యుయేషన్ డే

చిలుకూరు : మండలంలోని నారాయణపురం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రం-1లో సోమవారం గ్రాడ్యుయేషన్ డే ను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ తమ్మనబో యిన శంకర్ మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలకు పిల్లలను రెగ్యులర్‌గా పంపించాలన్నారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రంలో చదువు పూర్తయిన పిల్లలకు వీడ్కోలు ఇచ్చి వారిని పంపించారు. ఈ కార్యక్రమంలో వినోద్, టీచర్ బొల్లెంపంగు సుశీల, విజయ, ఆరోగ్య కేంద్రం సిబ్బంది, పిల్లలు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా మూలమలుపులు

- కానరాని హెచ్చరిక బోర్డులు
- పలుచోట్ల రోడ్లపై పెద్ద గుంతలు
- తరచూ ప్రమాదాలు
- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు



సిరికొండ-మోతె గ్రామాల మధ్య అంతర్గత రహదారిలో ప్రమాదకరమైన మూలమలుపు



రావిపహాడ్-సిరికొండ గ్రామాల మధ్య ఉన్న మూలమలుపు

మోతె : మండల కేంద్రంతో పాటు పలు గ్రామాలకు వెళ్లే రహదారులు ప్రమాదకరమైన మూల మలుపులు ప్రమాదాలకు నిలయాలుగా మారాయి. మోతె -సిరికొండ, రావిపహాడ్ గ్రామాలకు వెళ్లే రోడ్డు మార్గంలో అతి ప్రమాదకరమైన 10మూలమలుపులు ఉన్నాయి. అలాగే హు స్సేనాబాద్ -బుర్కచర్లకు వెళ్లే రోడ్డు మార్గంలో, విభళాపురం నుంచి కరక్కాయల గూడెం -విభళాపురం నుంచి బుర్కచర్ల గ్రామాని వెళ్లే రోడ్డు మార్గంలో కూడా అత్యంత ప్రమాదకరమైన మూలమలుపులతో పాటు పెద్ద పెద్ద గుంతలు ఉన్నాయి. కొత్త వారు ఈ రహదారుల గుండా ప్రయాణిస్తే ప్రమాదం చోటుచేసుకోవడం ఖాయం. ఏ ఒక్క చోట కూడా హెచ్చరిక బోర్డులు లేవు. ఉర్లుగొండ నుంచి నర్సింహాపురం, తుమ్మగూడెం, నేరడవాయి, గోపతండాకు వెళ్లే రోడ్డు మార్గంలో అతి ప్రమాదకరమైన మూలమలుపులు ఉన్నాయి. అంతేకాకుండా రోడ్డుకు ఇరువైపులా మార్జిన్ లేక ఎదురెదురుగా వచ్చే వాహనాలు ఒక్కోసారి ప్రమాదాలకు గురవుతున్నాయి.

సర్వీస్ రోడ్డుకు ఇరువైపులా పిచ్చి మొక్కలు

మండలం నలు మూలల గ్రామాల నుంచి మోతె మండల కేంద్రానికి చేరుకోవాలంటే వాహనదారులు అంతర్గత సర్వీస్ రోడ్ల నుంచి ప్రయాణం చేయాలి, ఆ సర్వీస్ రోడ్లకు ఇరువైపులా పిచ్చిమొక్కలు దట్టంగా పెరిగాయి. దీంతో ఎదురెదురుగా వచ్చే వాహనాలను తప్పించలేక ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఎదురెదురుగా వచ్చే ద్విచక్ర వాహనాలు, ట్రాక్టర్లు, వరి గడ్డి లోడుతో ప్రయాణిస్తున్న ట్రాక్టర్లు రోడ్డు వెంట ఉన్న కంప చెట్లల్లోకి దూసుకపోయి ప్రమాదాలు జరుగుతున్నాయి. అధికారులు చొరవ చూపి అంతర్గత సర్వీసు లింకు రోడ్లకు ఇరువైపులా ఉన్న కంప చెట్లు, పిచ్చి మొక్కలు జేసీబీలతో తొలగించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

> **హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలి**
>
> మండల పరిదిలోని వివిధ గ్రామాలకు వెళ్లే సర్వీసు రహదారుల వద్ద ఎలాంటి ప్రమాద హెచ్చరిక బోర్డులు లేవు.దీంతో వాహణదారులు నిత్యం అతి వేగంగా ప్రయాణించడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి.ఇకనైనా సంబందిత అధికారులు స్పందించి హెచ్చరి బోర్డులు నిర్మించి తగు రక్షణ చర్యలు చేపట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.
>
> – ఎల్‌రాజు, మోతె

మత సామరస్యానికి ప్రతీక ఇఫ్తార్ విందు



ముస్లింలకు దస్తులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

చిలుకూరు : మత సామరస్యానికి ప్రతీక ఇఫ్తార్ విందులు అని కోదాడ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ అన్నారు. సోమవారం చిలుకూరులో ముస్లింలకు ప్రభుత్వం నుంచి వచ్చిన దుస్తులను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్‌ఎస్ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలను ఆదుకుంటుందన్నారు. అనంతరం రంజాన్ మాసం సందర్భంగా చిలుకూరులో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందును ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ డైరక్టర్ కొండా సైదయ్య, జెడ్పీ కోఆప్షన్ సభ్యులు జానిమియా, సర్పంచ్ కొడారు బాబు, ఎంపీటీసీ బెల్లంకొండ నాగయ్య, రైతు సమన్వ సమితి మండల అధ్యక్షుడు దొడ్డా సురేష్‌బాబు, పీఏసీఎస్ చైర్మన్ అలసకాని జనార్దన్, తహసీల్దార్ రాజేశ్వరీ, ఎంపీడీఓ ఈదయ్య, ముస్లిం పెద్దలు ఖన్నం సాహెబ్, షేక్ పాషా, షరీఫ్ గ్రామస్తులు బీఆర్‌ఎస్ పార్టీ నాయకలు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనాన్ని జయప్రదం చేయాలి



మాట్లాడుతున్న సర్పంచ్ మన్నెం శ్రీనివాసరెడ్డి

మఠంపల్లి : మండలంలోని వర్ధాపురంలో ఈనెల 20న నిర్వహించనున్న బీఆర్‌ఎస్‌పార్టీ ఆత్మీయసమ్మేళనాన్ని జయప్రదం చేయాలని ఆ పార్టీ క్లస్టర్ ఇన్‌చార్జ్ మఠంపల్లి సర్పంచ్ మన్నెం శ్రీనివాసరెడ్డి కోరారు. సోమవారం మండలంలోని కాల్వపల్లితండాలో నిర్వహించిన సన్నాహక సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సమావేశంలో మండల బీఆర్‌ఎస్ అధ్యక్షులు పిచ్చయ్య, ఎంపీటీసీ లక్ష్మీభరత్‌నాయక్, నవీన్ నాయక్, వీనానాయక్, రవీందర్, రాజేష్, బాలు, కాంతారావు, శ్రీను, కీమా, శంకర్, మట్టపల్లి, లచ్చిరామ్, రంగా, నరసింహ పాల్గొన్నారు.

కొక్కిరేణి ఎంపీటీసీపై చర్యలు తీసుకోవాలి

- దళిత సంఘాల డిమాండ్
- అంబేద్కర్ విగ్రహం ఎదుట నల్లబ్యాడ్జీలతో నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

మునగాల : ఈనెల 14న మండలంలోని తిమ్మారెడ్డిగూడెంలో నూతనంగా ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహావిష్కరణ సందర్భంగా దళితులను అవమానపరిచి, కించపరిచే విధంగా వ్యవహారించిన కొక్కిరేణి ఎంపీటీసీ సభ్యుడు ఎర్రం శ్రీనివాస రెడ్డిపై ఎస్సీ, ఎస్టీ, అట్రాసిటీ కేసు నమోదు చేసి తక్షణమే అరెస్ట్ చేసి చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని దళిత హక్కుల పోరాట సమితి జిల్లా కన్వీనర్ రెమిడాల రాజు, అంబేడ్కర్ సేవాసమితి నాయకులు ఎల్‌పీ రామయ్యలు డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలోని స్థానిక సివిల్ ఆస్పత్రి ఆవరణలో దళితసంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. తిమ్మారెడ్డిగూడెంలో అంబేడ్కర్ 132వ జయంతి వేడుకలలో భాగంగా జై భీమ్ యువజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అంబేడ్కర్ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమం వద్దకు ఎంపీటీసీ శ్రీనివాసరెడ్డి వచ్చి యువజన సంఘం సభ్యులను ఇష్టం వచ్చినట్లు తిట్టారని ఆరోపించారు. దళితజాతిని అవమానపర్చిన రెడ్డి కులానికి చెందిన శ్రీనివాసరెడ్డికి అదే సామాజిక వర్గానికి చెందిన ఉత్తమ్‌కుమార్‌రెడ్డి దంపతులు వత్తాసు పలకడం హాస్యాస్పదంగా ఉందని ఎద్దేవా చేశారు.

నల్లబ్యాడ్జీలతో నిరసన..

అనంతరం మండల కేంద్రంలోని స్థానిక అంబేద్కర్ విగ్రహం ఎదుట నల్లబ్యాడ్జీలు ధరించి దళిత సంఘాల నాయకులు నిరసన వ్యక్తం చేశారు.అనంతరం స్థానిక సీఐ పీవీ రాఘవులుకు ఓ వినతిపత్రం అందచేశారు. ఈ కార్యక్రమంలో దళిత హక్కుల వేదిక జిల్లా కో కన్వీనర్ బాణాల అబ్రహాం, కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు నందిగామ సైదులు, హుస్సేన్, బీఎస్‌పీ నాయకులు కోట మన్మధుడు, అంబేడ్కర్ సేవాసమితి నాయకలు ఎల్‌పీ.రామయ్య, ఎల్.శ్రీను, ఎల్.నవీన్, రాజేష్ పాల్గొన్నారు.

బీసీ ఉద్యమాన్ని క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్లాలి



నియామక పత్రం అందజేస్తున్న సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కృష్ణమాచారి

హుజూర్‌నగర్ : బీసీ ఉద్యమాన్ని క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్లి బీసీలు సంఘటితశక్తిగా ఎదగాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మోడేపల్లి కృష్ణమాచారి అన్నారు. సోమవారం హుజూర్‌నగర్‌లో బీసీ సంక్షేమ సంఘం జిల్లా స్థాయి ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడారు. తెలంగాణ వ్యాప్తంగా ఉన్న బీసీలు సంఘటితం కావాలన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ వర్గాలతో పాటు అగ్రవర్ణాల నిరుపేదలు కూడా ఉమ్మడి అభ్యర్థిని నిలబెట్టి గెలిపించుకోవాలని ఆయన సూచించారు. అనంతరం వివిధ రంగాల వారికి జిల్లా స్థాయి, నియోజకవర్గ స్థాయి బాధ్యతల్లో నియమిస్తూ నియామక పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ కన్వీనర్ ధనుంజయ నాయుడు, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ధూళిపాల శ్రీనివాస్, జిల్లా ప్రధాన కార్యదర్శి జి రాంబాబు, నియోజకవర్గ నాయకులు ఐ వెంకటరమణాచారి, ఎం నాగమణి, జె శ్రీనివాస్, వై నాగమణి, పట్టణ నాయకులు బి గోవింద రావు, నరసింహాచారి, ఆర్ వెంకటేశ్వర్లు, ఎం వెంకటేశ్వర్లు, జి దీప, ఎం రాజారావు, బి నాగేశ్వరరావు, ఎ నరసింహచారి, డి రామరాజు, జి రాధాకృష్ణ, శాంతయ్యచారి, వీరాచారి తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి 'ఓజో' రూ.6లక్షల విరాళం



ఆలయకమిటీ సభ్యులతో మాట్లాడుతున్న ఓజో చైర్మన్ రఘు

మఠంపల్లి : మండల కేంద్రమైన మఠంపల్లి సమీపంలో గౌడకులస్తులు నూతనంగా నిర్మిస్తున్న శ్రీకంఠమహేశ్వరస్వామి ఆలయ నిర్మాణానికి ఓజో ఫౌండేషన్ చైర్మన్ పిల్లుట్ల రఘు రూ.6లక్షలను విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ వ్యాప్తంగా ఓజో ఫౌండేషన్ ఆధ్వర్యంలో సామాజిక సేవాకార్యక్రమాలు కొనసాగిస్తున్నట్లు తెలిపారు. కాగా ఆలయ కమిటీ సభ్యులు పిల్లుట్ల రఘుకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు మహేష్‌గౌడ్, ఎల్లయ్యగౌడ్, రామయ్యగౌడ్, శ్రీనివాస్‌గౌడ్, సైదులుగౌడ్, మట్టపల్లి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

'కంటి వెలుగు'ను సద్వినియోగం చేసుకోవాలి



కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

హుజూర్‌నగర్ రూరల్ : మండల పరిధిలోని లింగగిరి గ్రామం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ×కంటి వెలుగు× శిబిరాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని మాజీ సర్పంచ్ ఫాతిమా కోరారు. సోమవారం ఆమె గ్రామంలోని కంటి వెలుగు శిబిరాన్ని పరిశీలించి మాట్లాడారు. ఇప్పటి వరకు గ్రామంలో 520మందికి కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి అద్దాలు అందజేశారు. ఆపరేషన్ల నిమిత్తం 72మందిని సూర్యాపేట జిల్లా ఆస్పత్రికి రిఫర్ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ మంగా, ఆప్తమాలజిస్ట్ అశోక్, సూపర్‌వైజర, ఏఎన్‌ఎం, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

విశ్వబ్రాహ్మణ అన్నదానసత్రం అభివృద్ధికి సహకరించాలి

మఠంపల్లి : మండలంలోని మట్టపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో గల విశ్వబ్రాహ్మణ నిత్యాన్నదాన సత్రం అభివృద్ధికి రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన విశ్వబ్రాహ్మణ కులస్తులు సహకరించాలని సత్రకమిటీ అధ్యక్షుడు ఉద్దోజు సూర్యనారాయణాచారి కోరారు. సోమవారం స్థానిక సత్రంలో నిర్వహించిన కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మే నెల మొదటి వారంలో తేదీన జరగనున్న స్వామివారి కల్యాణ బ్రహ్మోత్సవాలకు రానున్న వేలాదిమంది భక్తులకు భోజనవసతి సౌకర్యాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో ప్రధానకార్యదర్శి వీరాచారి, కోశాధికారి బ్రహ్మయ్యాచారి, కె.సూర్యనారాయణ, వెంకటేశ్వర్లు, మల్లాచారి, నరసింహాచారి, సీతారాములుచారి, లక్ష్మణాచారి, విష్ణుమూర్తి పాల్గొన్నారు.

అర్హులైన కళాకారులకు పెన్షన్ ఇవ్వాలి

హుజూర్‌నగర్ : అర్హులైన కళాకారులకు ప్రభుత్వం పెన్షన్‌లు ఇవ్వాలని తెలంగాణ జానపద కళాకారుల జిల్లా అధ్యక్షుడు జి ఆంజనేయులు అన్నారు. సోమవారం తెలంగాణ జానపద కళాకారుల జిల్లా కమిటీ సమావేశం హుజూర్‌నగర్‌లోని సీపీఐ కార్యాలయంలో నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అన్ని రంగాలలోని అర్హులైన కళాకారులకు పెన్షన్ ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కళాకారులు సత్యనారాయణ, వీరు నాయుడు, నాగార్జున, సతీష్, వీరన్న, రామకృష్ణ, ప్రసాద్, గోవింద్, జగన్మోహన్ రెడ్డి, కామేశ్వరమ్మ, జయశంకర్ పాల్గొన్నారు.

గొర్రెల పంపిణీతో యాదవులు ఆర్థికంగా అభివృద్ధి

- ఎమ్మెల్యే సైదిరెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సైదిరెడ్డి



రంజాన్ తోఫాను అందజేస్తున్న ఎమ్మెల్యే సైదిరెడ్డి

హుజూర్‌నగర్ : సీఎం కేసీఆర్ ముందు చూపుతో ప్రవేశపెట్టిన ఈ పథకం వల్ల ఎంతో మంది యాదవులు ఆర్థికంగా అభివృద్ధి చెందుతున్నారని ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి అన్నారు. రెండో విడత గొర్రెల పంపిణీపై సోమవారం హుజూర్‌నగర్‌లోని ఎమ్మెల్యే నూతన క్యాంప్ కార్యాలయంలో యాదవులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అంతేగాకుండా తెలంగాణ రాష్ట్రం మాంసం ఎగుమతి చేసే స్థాయికి చేరిందని ఇది యాదవ, గొల్లకురుమల కృషి వల్లే సాధ్యమైందని కొనియాడారు. రెండోవిడతలో ఎటువంటి అవకతవకలకు తావు లేకుండా గొర్రెల పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. మొదటి విడతలో సాంకేతిక కారణల వల్ల ఎవరికైనా రాకున్నా ఈ సారి అందరికీ వరుస క్రమంలో గొర్రెల పంపిణీ జరుగుతుందని తెలిపారు. బ్యాంకు వారి నుంచి ఇబ్బందులు రాకుండా బ్యాంక్ అధికారులతో మాట్లాడుతానని తెలిపారు. యాదవ సంఘాల అభివృద్ధి కోసం సొసైటీలను పునరుద్ధరిస్తామని ఈ విషయమై డీసీఓతో మాట్లాడుతానని ఆయన తెలిపారు. గొర్రెల విషయంలో పశువైద్యాధికారులను సిబ్బందిని మాత్రమే నమ్మి వారు చెప్పిన విధంగా నడుచుకోవాలని ఆయన సూచించారు. జిల్లా పశువైద్యాధికారి డాక్టర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ గతంలో గ్రామసభలో ఎంపికైన వారికి రెండో విడత పంపిణీ ఉంటుందని తెలిపారు. ప్రతి లబ్ధిదారుడికి ఒక కోడ్ ఉంటుందని, ఆ కోడ్ ప్రకారం నడుచుకోవాలని ఆయన తెలిపారు. ఈ సదస్సులో నియోజకవర్గంలోని పశువైద్యాధికారులు శ్రీనివాస్‌రెడ్డి, ఉషారాణి, రమేష్, మధు, నాగేంద్ర, రవి, శ్రీకాంత్, శంకర్‌లతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, గొర్రెల పెంపకం దారుల సంఘ సభ్యులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

దృష్టిలోపం నివారణకే 'కంటి వెలుగు'

దృష్టిలోపం నివారణకే కంటి వెలుగు వైద్య శిబిరాలను ప్రభుత్వం ఏర్పాటు చేసిందని ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి అన్నారు. సోమవారం హుజూర్‌నగర్‌లో 20 వార్డులో రెండో విడత కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరికీ కంటి పరీక్షలు చేసి దృష్టి లోపం ఉన్నవారికి కంటి అద్దాలను ఇస్తారని చెప్పారు. అవసరం అయిన వారికి ఉచిత ఆపరేషన్లు చెయిస్తారని ఆయన అన్నారు. కంటి వెలుగు శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్‌పర్సన్ దొంతగాని లక్ష్మమ్మ, మున్సిపల్ వైస్ చైర్మన్ జె నాగేశ్వరరావు, కౌన్సిలర్ పద్మ, మున్సిపల్ మాజీ చైర్మన్ శ్రీనివాస్, నాయకులు అమర్‌నాథ్‌రెడ్డి, అమర్‌గౌడ్, హుస్సేన్ గౌడ్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

హుజూర్‌నగర్ : రాష్ట్రంలో అన్ని కులాలు, అన్ని మతాలు కలిసి తెలంగాణకు మరింత సామాజిక శోభను తెస్తున్నాయని ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి అన్నారు. సోమవారం హుజూర్ నగర్‌లోని పెద్ద మసీదులో ఇఫ్తార్ విందు, రంజాన్ తోఫా పంపిణీని చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. ప్రభుత్వం అన్ని పండుగలను సమానంగా చూస్తుందని అర్హులైన అందరూ నిరుపేదలకు బహుమతులను బట్టలను పంపిణీ చేస్తుందని చెప్పారు. ప్రజలందరికీ రంజాన్ పర్వదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మసీదు కమిటీ సభ్యులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, మైనార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ముస్లింలకు రంజాన్ తోఫా అందజేత

హుజూర్‌నగర్ రూరల్ : పవిత్ర రంజాన్ మాసాన్ని ముస్లిం సోదరులు భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి అన్నారు. సోమవారం ఆయన మండల పరిదిలోని మర్రిగూడెంలో ముస్లిం సోదరులకు రంజాన్ తోఫా అందజేశారు. అనంతరం ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో పాల్గొని మాట్లాడారు. మతసామరస్యాలకు ప్రతీక ఇఫ్తార్ విందు అని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు, ముస్లిం పెద్దలు పాల్గొన్నారు.

అసిస్టెంట్ స్టాటిస్టికల్ కో ఆర్డినేటర్‌గా జాఫర్ ఎంపిక



మునగాల : సమగ్ర శిక్ష అభియాన్ ప్రాజెక్టులో మూడేళ్లపాటు జిల్లా విద్యాశాఖలో అసిస్టెంట్ స్టాటిస్టికల్ కోఆర్డినేటర్‌గా బాధ్యతలు నిర్వర్తించేందుకు దిన మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలకు ఉపాధ్యాయుడు షేక్ జాఫర్ ఎంపికయ్యాడు. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన ఆన్‌లైన్ పరీక్షలో ఆయన మొదటి ర్యాంకు సాధించాడు. ఈ సందర్భంగా జాఫర్ మాట్లాడుతూ సమగ్ర శిక్ష అభియాన్ ప్రాజెక్టులో మూడేళ్లపాటు బాధ్యతలు నిర్వర్తించాల్సి ఉంటుందన్నారు. కాగ తాను మొదటి ర్యాంకు సాధించినందుకు మండల విద్యాధికారి ఎండీ.సలీమ్ షరీఫ్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు దండు సీతరామరాజు, ఉపాధ్యాయులు అభినందించినట్లు తెలిపారు.

ఆర్థిక సాయం అందజేత

నేరేడుచర్ల : నేరేడుచర్ల మున్సిపాలిటీలోని 4వ వార్డుకు చెందిన సయ్యద్ నాగుల్ మీరా అనారోగ్యంతో మృతి చెందాడు. సోమవారం ఈ విషయం తెలుసుకున్న నేరేడుచర్ల పట్టణ బీఆర్‌ఎస్ అధ్యక్షురాలు, మున్సిపల్ వైస్ చైర్మన్ చల్లా శ్రీలతారెడ్డి ఆ కుటుంబాన్ని పరమార్శించి రూ.5వేల ఆర్థిక సాయం అందజేశారు.

స్వామివారికి వెండి నాగహారతుల బహూకరణ



వెండి హారతులు బహూకరిస్తున్న దాతలు

గరిడేపల్లి : మండలంలోని కీతవారిగూడెంలోని శ్రీపార్వతీ సమేత రామలింగేశ్వరస్వామివారి ఆలయానికి వెండి నాగహారతులను సోమవారం హుజూర్‌నగర్‌కు చెందిన కన్నెగుండ్ల వెంకటేశ్వర్లు ధర్మపత్ని పుష్పావతి జ్ఞాపకార్థంగా మూడు కిలోలతో తయారు చేసిన వివిధ రకాల హారతులను అందజేశారు. దేవాలయానికి మూడు కిలోల వెండితో తయారు చేసిన నాగ హారతి, నక్షత్ర హారతి, బిల్వహారతి, త్రిశులహారతి, నంది హారితి వంటి వస్తువులను తయారు చేసి ఆలయానికి బహూకరించారు. ఈ కార్యక్రమంలో వారి కుమారులు సీతారాం, ప్రవీణ్, రామ్ నరేష్, దేవాలయ అధ్యక్షులు కొంగరి శ్రీనివాస్, ఉపాధ్యక్షులు కీత శ్రీనివాస్, గుండు సైదయ్య, ఓరుగంటి వెంకటరమణ, మేళ్లచెరువు రాంమ్మూర్తి, రాయపోలు శ్రీరామయ్య, చంద్రయ్య, వెంకటేశ్వర్లు, కోటయ్య, రామచంద్రయ్య, భద్రయ్య, రమేష్, సోమయ్య, రామయ్య, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

కొనసాగుతున్న అగ్నిమాపక వారోత్సవాలు



మైహోం సిమెంట్స్‌లో అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

మేళ్లచెరువు : అగ్నిమాపక వారోత్సవాల సందర్భంగా మండల పరిధిలోని మైహోం సిమెంట్స్ పరిశ్రమలో అగ్నిమాపక వారోత్సవాలు సోమవారం కొనసాగాయి. ఈ సందర్భంగా పరిశ్రమలో సిబ్బంది ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించాల్సిన చర్యలు కార్మికులకు, ఉద్యోగులకు అవగాహన కల్పించారు. ఈ కార్య క్రమంలో యూనిట్ హెడ్ శ్రీనివాసరావు, ఏవీపీ పంకజ్, హెచ్‌ఆర్‌హెడ్ నాగేశ్వరరావు, అగ్నిమాపక కేంద్ర అధికారి లక్ష్మయ్య, భద్రతా సిబ్బంది పాల్గొన్నారు.

మాజీ జెడ్పీటీసీకి పరామర్శ



ఉపేందర్‌రావును పరామర్శిస్తున్న శశిధర్‌రెడ్డి

మునగాల : మండలంలోని తాడువాయి గ్రామానికి చెందిన మాజీ జెడ్పీటీసీ సభ్యుడు కోల ఉపేందర్‌రావు ఇటీవల కంటి ఆపరేషన్ చేయించుకొని తన నివాసంలో విశ్రాంతి తీసుకుంటుండగా సోమవారం కోదాడ నియోజకవర్గ బీఆర్‌ఎస్ నాయకుడు కన్మంతరెడ్డి శశిధర్‌రెడ్డి పరామర్శించి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఇటీవల మండలంలోని కలకోవ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ చిర్రా శ్రీనివాస్ తండ్రి అనారోగ్యంతో మృతిచెందడంతో సోమవారం నిర్వహించిన దశదినకర్మలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల నాయకలు వి.లింగారెడ్డి, చెవుల లక్ష్మయ్య, కొణతం శ్రీనివాసరెడ్డి, బొలిశెట్టి నాగేంద్రబాబు, శశిధర్‌రెడ్డి యువసేన నాయకులు రాయి రవి, కోట వెంకన్న, వినయ్, వంశీ, ప్రవీణ్, విజయరామారావు, సుధాకర్ పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ నాయకుడికి పరామర్శ

నడిగూడెం : మండల పరిధిలోని కరివిరాల గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు రణబోతు రామిరెడ్డి ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. దీంతో సోమవారం కోదాడ నియోజకవర్గం మాజీ ఇన్‌చార్జ్ కన్మంతరెడ్డి శశిధర్‌రెడ్డి రామిరెడ్డిని పరామర్శించారు. ఆయన వెంట రైతు సమన్వయ సమితి జిల్లా కమిటీ సభ్యుడు నాగిరెడ్డి లింగారెడ్డి, చెన్నకేశవ ఆలయ కమిటీ మాజీ చైర్మన్ అనంతరెడ్డి, సీనియర్ నాయకులు వెంకన్న, శ్రీనివాసరెడ్డి, నాగేంద్రబాబు, విజయరామారావు, ఉపేందర్, ప్రవీణ్ కుమార్, శేషన్న తదితరులు పాల్గొన్నారు.

మహిళా చట్టాల అమలులో కేంద్రం విఫలం

చిలుకూరు : మహిళా రక్షణ చట్టలు అమలు చేయడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని మహిళా సమాఖ్యా జిల్లా ప్రధాన కార్యదర్శి దేవరం మల్లేశ్వరీ విమర్శించారు. సోమవారం చిలుకూరు మండలం సీతారాంపురంలో ఇంటింటికీ తిరుగుతూ మహిళలకు మహిళా సమాఖ్యా సభ్యత్వాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పార్లమెంట్ మహిళా బిల్లు ప్రవేశపెట్టి ఏళ్లు గడుస్తున్నా నేటి వరకు అమోదం కాలేదన్నారు. వెంటనే మహిళా బిల్లు అమోదించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మహిళా సమాఖ్య మండల అధ్యక్ష, కార్యదర్శులు ప్రమిదల జయసుధ, సాతులూరి అలివేలు, గన్నా సత్య,తొడేటి కటమ్మ, శైలజ, భూలక్ష్మి, సుజాత, ఈశ్వరమ్మ, నాగమ్మ, గోవిందమ్మ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు బియ్యం పంపిణీ

నేరేడుచర్ల : మండలంలోని మేదారం గ్రామంలో సోమవారం ఓజో ఫౌండేషన్ ఆధ్వర్యంలో పేదలకు బియ్యం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఓజో ఫౌండేషన్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వెంకన్న మాట్లాడుతూ ఓజో ఫౌండేషన్ చైర్మన్ పిల్లుట్ల రఘు పేదల కోసం అనేక సేవా కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఓజో ఫౌండేషన్ మండల ఇన్‌చార్జ్ ఎస్‌కె నాగులమీరా, సభ్యులు శ్రీను, మహేశ్, గోపీ, సతీశ్, సాయి, పవన్, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు

మఠంపల్లి : మండలంలోని రఘునాథపాలెంలో మంగళవారం సాయంత్రం స్థానికంగా ఇఫ్తార్ విందును ఏర్పాటు చేసినట్లు పీసీసీ ఉపాధ్యక్షుతు సయ్యద్ నిజామ్, పీఏసీఎస్ చైర్మన్ రామచంద్రయ్య తెలిపారు. ఈ విందుకు నల్లగొండ ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ హజారుద్దీన్ ముఖ్యఅతిథులుగా హాజరువుతున్నట్లు పేర్కొన్నారు.